


# ప్రకటనలపై కట్టడి

ఒక అమ్మాయి నల్లగా ఉంటుంది. దాంతో వచ్చిన సంబంధాలన్నీ తప్పిపోతుంటాయి. ఆమె దిగులు పడుతూంటుంది. ఇది చూసి ఓ అందమైన స్నేహితురాలు ఫలానా ఫేస్ క్రీమ్ వాడమని ఆమెకు సూచిస్తుంది. అది వాడడం తరువాయి ఆమె మల్లె మొగ్గలా తెల్లగా మారిపోతుంది. అందమైన మొగుణ్ణి సొంతం చేసుకోగలుగుతుంది. మరొక అమ్మాయిని డిన్నర్‌లో వంట సరిగ్గా కుదరకపోవడంతో ఇంటిల్లిపాదీ చీదరించుకుంటుంది. ఆ అమ్మాయి ఫలానా కంపెనీ నూనె వాడడంతో వంట అద్భుతంగా కుదిరి కుటుంబం మెప్పు పొందుతుంది. ఇలాంటి దృశ్యాలు మీ ఇడియట్ బాక్సులో ప్రకటనల రూపంలో కోకొల్లలుగా కనిపిస్తాయి. ప్రపంచంలో అన్ని రంగాల్లోనూ విస్తరిస్తోన్న స్త్రీ శక్తి టీవీ ప్రకటనల దగ్గరకొచ్చేసరికి మాత్రం చాలా ఇరుకు ప్రపంచంలో జీవిస్తున్నట్టు, అల్పసంతోషాలకు మురిసిపోతున్నట్టు కనిపిస్తోంది. అయితే ఇక మీదట ఇలాంటి చచ్చు ప్రకటనలకు తెరపడే అవకాశం కనిపిస్తోంది. ఇలా ఆడవాళ్ళ జీవితాలన్నీ అందంపైనే ఆధారపడి ఉన్నట్టు చూపించే ప్రకటనలే కాక, ఆడ వాళ్ళకు వంటిల్లే దేవాలయమన్నట్టూ వారిని ఎప్పుడూ స్టవ్ ముందే చూపించే ప్రకటనలు, మగాడి షేవింగ్ క్రీమ్ ప్రచారానికి కూడా బికినీల్లో ఆడవాళ్ళను ఉపయోగించుకునే ప్రకటనలు ఇక ముందు మనకు కనిపించకపోవచ్చు. వీటిపై నిషేదం విధించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. న్యూఢిల్లీ లోని నేషనల్ కమిషన్ ఫర్ వుమన్ అనే సంస్థ ప్రకటల్ని కూడా చట్ట పరిధిలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. టీవీ ప్రకటనల్లో చాలా శాతం స్త్రీని అబలగా, ఒక వస్తువులా చిత్రీకరిస్తున్నాయని ఈ సంస్థ ఫిర్యాదు. ఇదివరకే 'స్త్రీల అశ్లీల చిత్రీకరణ (నిషేధ) చట్టం' అనేది ఒకటి ఉంది. అయితే ఇప్పటి వరకూ సినిమాలే దీని పరిధిలోకి వచ్చేవి. టీవీలు, ఎస్.ఎం.ఎస్‌లు, ఎం.ఎం.ఎస్‌లు, ఇంటర్‌నెట్ ఇవన్నీ ఈ చట్ట పరిధిలోకి రావు. అవి కూడా దీని పరిధిలోకి వచ్చేలా చట్టాన్ని సవరించాలని ఈ సంస్థ డిమాండ్ చేస్తోంది. ఇది అంగీకారానికొస్తే మనకిలాంటి ప్రకటనల బాధ కొంతవరకూ తప్పవచ్చు.

'సరసి'కత

# క్రికెట్టు

వైశంపాయనుడి గారి వీక్‌నెస్సుల్లో క్రికెట్టొకటి!

మొదట్లో క్రికెట్ గురించి అవగాహన లేకపోయినా గొప్ప కోసం "స్కోరెంత?" అని అడిగేవాడు. ఈయనకి క్రికెట్ గురించి బొత్తిగా తెలియదని కనిపెట్టేసిన పిలగాళ్లు "14 వికెట్లకి 250 రన్స్" అనే వాళ్లు. "అబ్బా పద్నాలుగు వికెట్లే? వెరీగుడ్!" అని ఆశ్చర్యపడిపోయి, తర్వాత పిల్లలు ఎగతాళి చెయ్యడం ప్రారంభించేసరికి అక్కణ్ణించి మెల్లగా జారుకునే వాడు.

మొన్నా మధ్య చవగ్గా వస్తోందని సెకండ్ హేండ్ టీవీ ఒకటి కొన్నాడు వైశంపాయనుడుగారు. ఏ ఛానల్‌లో క్రికెట్టొచ్చినా చూడటమే ఆయన పనిప్పుడు.

ఓ రోజు – ఇల్లు ఊడుస్తూ హాల్లోకి వచ్చిన సుబ్బాయమ్మగారు భర్త కండిషన్



చూసి భయపడి పోయింది. క్రికెట్ చూస్తున్న వైశంపాయనుడు గారు పిచ్చటెన్షన్‌లో ఉన్నాడు. ఇప్పుడు సచిన్ ఆఖరు బంతికి 4 రన్స్ చెయ్యాలి. చేస్తాడా చెయ్యడా? చెమటలు పట్టేస్తున్నాయి ఆయనకి. ఆ 4 రన్సూ చేస్తే కప్పొస్తుంది. లేకపోతే పాకిస్తాన్ చేతిలో ఘోర పరాభవం! ఆ ఉత్కంఠ భరించ లేకపోతున్నాడు వైశంపాయనుడు గారు.

సుబ్బాయమ్మగారికి పరిస్థితి తీవ్రత అర్థమైంది. భర్తకి ఏం అనారోగ్యం వచ్చేస్తుందోనని భయపడిపోతూ అడిగింది "ఇంతకీ ఈ మేచ్ ఎక్కడ జరుగుతోందండీ?" అని

వైశంపాయనుడుగారు టెన్షన్‌లోనే జవాబు చెప్పేడు.

"ఇప్పుడు జరగట్లా. ఇది మొన్న హైదరాబాదులో జరిగిన మేచ్ హైలైట్సు!!" అని.

*